క్లుప్తంగా

మంత్రిని కలసిన రామచంద్ర



పెనుకొండ: రాష్ట్ర భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా పుంగనూరులో కలిసినట్లు రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొగాకు రామచంద్ర తెలిపారు. తన ఎంపికకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



మట్టిని తరలించడంతో చెరువులో ఏర్పడిన గుంతలు

పెనుకొండ రూరల్: అధికారుల వద్ద నామమాత్రంగా అనుమతులు పొంది కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. మండలంలోని మరువపల్లికి చెందిన చెరువులో నామమాత్రం అనుమతులు పొంది ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

తక్కువ ధరకే నిత్యావసరాలు



సరుకులను వినియోగదారుడికి అందజేస్తున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

హిందూపురం టౌన్: పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకే బియ్యం, కంది పప్పు అందించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించినట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖ, హోల్‌సేల్ ఫుడ్‌గ్రెస్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన బియ్యం, కందిపప్పు ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్ రూం నంబర్ 14లో ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సోనా మసూరి బియ్యం 1కేజీ రూ.44, కంది పప్పు 1 కేజీ రూ.135 పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బైసాని రాంప్రసాద్, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ హారతి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకదశ రుద్రాభిషేకం



ప్రసంగిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

హిందూపురం: సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా ప్రపంచ శాంతి కోసం స్థానిక వాసవీ ధర్మశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేక కార్యక్రమాలు, భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. అలాగే సత్యసాయి బాబా సందేశాలను వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ప్రాణాలకు తెగించి సేవలు



రవికుమార్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తిమ్మరాజు (ఫైల్)

హిందూపురం అర్బన్: కరోనా సమయంలో ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో గాథ. హిందూపురం రూరల్ ప్రాంతం గొళ్లాపురానికి చెందిన రవికుమార్ కరోనా బారిన పడి పరిస్థితి విషమంగా మారడంతో బత్తలపల్లి ఆస్పత్రికి తరలించారు. నా అన్న వాళ్లు కూడా ఆయన దగ్గరకు వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో గొళ్లాపురానికి చెందిన వలంటీర్ తిమ్మరాజు సమయానికి పింఛన్ అందించడంతో పాటు అన్నీ తానై దగ్గరుండి రవికుమార్‌కు సేవలందించారు. అయితే ఆరోగ్యం విషమించడంతో రవికుమార్ మృతి చెందారు. ఆస్పత్రికి తరలించడం మొదలు అన్నీ తానై వ్యవహరించిన తిమ్మరాజు సేవలను స్థానికులంతా కొనియాడారు. అదే సమయంలో మరెవరూ కరోనా బారిన పడకూడదన్న ఉద్దేశంతో తిమ్మరాజు గ్రామంలో మైకు ద్వారా జాగ్రత్తలు చెప్పడంతో పాటు అవసరమైన వారికి సరుకులు అందజేశారు. తమ పరిధిలో అర్హులకు పింఛన్ మొదలు అన్ని పథకాలు వర్తింపజేస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు.

తిమ్మరాజు సేవలు భేష్



గొళ్లపురం గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా సరే నేనున్నానంటూ తిమ్మరాజు ముందుంటారు. కరోనా సమయంలోనే కాదు ఇప్పుడు కూడా ఆయన పరిధిలోని ఇళ్లలోని వారికి పథకాలు అందేలా కృషి చేస్తున్నారు. తిమ్మరాజు సేవలను మరులేము.

– కెంచరాయప్ప, సచివాలయ కార్యదర్శి, గొళ్లాపురం

కష్టకాలంలో అండగా..



అంజినప్పకు పింఛన్ అందిస్తున్న గాయత్రి

రొద్దం: మండల కేంద్రానికి చెందిన అంజినప్ప రెండేళ్ల క్రితం పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. నడవలేనిస్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ గాయత్రి దగ్గరుండి పింఛన్‌కు దరఖాస్తు చేయించి పింఛన్ మంజూరుకు కృషి చేసింది. ఇప్పుడాయనకు పింఛనే ఆసరాగా మారింది.

ఇంటి మనిషిలా చూసుకుంటోంది



వలంటీర్ గాయత్రి ఇంటి మనిషిలా సాయం చేశారు. ఆ అమ్మాయే లేకపోతే నాకు పింఛన్ వచ్చేది కాదు. ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తోంది. నా యోగాక్షేమాలను అడిగి తెలుసకుంటూ ఇంట్లో వ్యక్తిగా వ్యవహరిస్తోంది. వలంటీర్ వ్యవస్థ లేకపోతే మాలాంటి వారి పరిస్థితి చాలా అధ్వానంగా ఉండేది.

– బోయ అంజినప్ప, రొద్దం

ఆల్ ఫ్రీ బాబును జనం నమ్మరు



చందకచెర్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: ఆల్ ఫ్రీ అంటూ ప్రజలను మోసం చేయడానికి మరోసారి ప్రయత్నిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబును జనం నమ్మే పరిస్థితిలో లేరు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలుస్తోంది' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. చందకచెర్ల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూనే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 14 గ్రామ సచివాలయల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తుండటాన్ని చూసి జీర్ణించుకోలేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వారిని కించపరిచే విధంగా అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు బీఎల్ రామకృష్ణ, నాగరాజుగౌడు, సర్పంచులు ప్రభావతిబాయి, గీత, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, ఎంపీటీసీ భాగ్యాబాయి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బాబిరెడ్డి, ఎస్సీ,బీసీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, మంజునాథ్, రంగనాథ్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా 'యంత్ర సేవ'

- రైతులకు తప్పిన అధిక అద్దె భారం
- తక్కువ ఖర్చుతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వైనం
- 'వైఎస్సార్ యంత్ర సేవ' నిరంతరం కొనసాగుతుందంటున్న అధికారులు

వ్యవసాయ పనిముట్లు పొందిన రైతుల సంఖ్య	: 97
పనిముట్ల విలువ	: రూ.4.81 కోట్లు
ప్రభుత్వ సబ్సిడీ	: రూ.1.54 కోట్లు
137 ట్రాక్టర్ల విలువ	: రూ.10.33 కోట్లు
ప్రభుత్వ సబ్సిడీ	: రూ.3.94కోట్లు



వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా పొందిన ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు వరంగా మారింది. యంత్ర సేవ ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో వ్యయసాయ పనులు చేసుకుంటున్నారు. వివిధ వ్యవసాయ పనులకు ఈ మధ్య కాలంలో ట్రాక్టర్ల అద్దె భారీగా పెరిగింది. ట్రాక్టర్ల అద్దెను రైతులు భరించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవ పథకం తీసుకొచ్చి అండగా నిలిచింది. విరివిగా రైతులకు సబ్సిడీతో ట్రాక్టర్లు మంజూరు చేసి ఆదుకుంటోంది.

137 ట్రాక్టర్లు అందించిన ప్రభుత్వం

జిల్లాలో 416 ఆర్బీకేలు ఉన్నాయి. 2021–22లో 182 సీహెచ్‌సీ (కస్టమ్ హైరింగ్ సెంటర్)లు ఏర్పాటయ్యాయి. 2022–23లో 234 సీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఒక సీహెచ్‌సీకి ఐదుగురు రైతుల చొప్పున గ్రూపులుగా ఏర్పడి 2023–24లో ట్రాక్టర్లు, వివిధ వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో పొందారు. 137 సీహెచ్‌సీలకు ప్రభుత్వం ట్రాక్టర్లను అందించింది. 97 సీహెచ్‌సీలకు వివిధ వ్యవసాయ పని ముట్లను అందించింది.

రూ.548 కోట్లు సబ్సిడీ

జిల్లాలో 2023–24లో రైతు గ్రూపులకు అందించిన 137 ట్రాక్టర్ల విలువ రూ.10.33 కోట్లు కాగా... ఇందులో ప్రభుత్వం రూ.3.94 కోట్లు సబ్సిడీ అందించింది. అదే విధంగా 97 వ్యవసాయ పనిముట్ల విలువ రూ. 4.81 కోట్లు కాగా... ప్రభుత్వం సబ్సిడీ కింద రైతులకు రూ.1.54 కోట్లు ఇచ్చింది.మొత్తం రూ.15.14కోట్ల విలువైన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లకుగాను ప్రభుత్వం రైతులకు రూ.5.48 కోట్ల సబ్సిడీ అందించి ఆదుకుంది.

వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద అందించినట్రాక్టర్ల వివరాలు	
డివిజన్	అందించిన ట్రాక్టర్లు
మడకశిర	29
హిందూపురం	29
పెనుకొండ	18
కదిరి	31
ధర్మవరం	30
మొత్తం	137

ఖర్చు తగ్గింది



వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు వరంగా మారింది. ఐదుగురు రైతులు కలిసి ఏర్పాటు చేసుకున్న గ్రూపునకు ప్రభుత్వం ట్రాక్టర్, ఇతర పనిముట్లు అందించింది. తక్కువ అద్దెతో వీటిని ఉపయోగించుకుని వ్యవసాయ పనులు చేసుకుంటాం. ప్రైవేట్ ట్రాక్టర్లకు అధిక అద్దె చెల్లించాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ట్రాక్టర్లు అందించడంతో వ్యవసాయ పనులకు ఖర్చు తగ్గింది.

– ముకుందప్ప, ఆర్‌జీహళ్లి, అగళి

జగన్ రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతు పక్షపాతి. వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా వ్యవసాయ పెట్టుబడి కొంతవరకు తగ్గింది. ఇప్పటికే రైతు భరోసా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోంది. ఆర్బీకేలు కూడా రైతులకు అనేక సేవలందిస్తున్నాయి. రైతులను ఇంత పెద్దస్థాయిలో ఆదుకుంటున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

– కరియప్ప, హనుమనహళ్లి, అగళి

137 ట్రాక్టర్లు అందించాం



జిల్లాలో ఈఏడాది రైతులకు వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా 137 ట్రాక్టర్లు అందించాం. 97 వివిధ పనిముట్లు ఇచ్చాం. రైతులకు ఈ పథకం ద్వారా ఎంతో ఊరట లభించింది. వ్యవసాయ పెట్టుబడి తగ్గింది. ట్రాక్టర్లకు అధిక అద్దె చెల్లించే పరిస్థితి ఇప్పుడు లేదు. ఈ పథకాన్ని నిరంతరంగా కొనసాగిస్తుంది. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నిరాధర ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకలు

రొళ్ల: మడకశిర నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే పై స్థానిక ఎంపీపీ కవిత, భర్త విజయరంగేగౌడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సిమెంట్ బస్తాల గోల్‌మాల్‌తో ఎమ్మెల్యేకు సంబంధం లేదన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈడిగ విద్యార్థులకు ఆర్థికసాయం



విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

హిందూపురం: ఆర్థికంగా వెనుకబడిన ఈడిగ కుల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు హిందూపురం ఈడిగ సంఘం అధ్యక్షుడు పుల్లయ్య గౌడ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.2,70,000ను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈడిగ కుల పెద్దలు రామకిష్టప్ప, దేవేంద్రయ్య, మల్లికార్జున, చిన్నప్పయ్య, నారాయణప్ప, సంఘ డైరెక్టర్లు నారాయణస్వామి, నాగేంద్ర, రాజశేఖర్, విజయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ పంచాయతీ ఎన్నికలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీల అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు రెండో విడత ఎన్నికలు సోమవారం నుంచి జరగనున్నాయి. 17న విరుపసముద్ర, రొప్ప (రూరల్), కన్నమేడి, ర్యాపిట, నాగలమడక, జే అచ్చమ్మనహళ్లి, చిక్కహళ్ళి, సిద్దాపుర, కొండేతిమ్మనహళ్లి, బూదిబెట్ట, చెన్నకేశవపుర పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతాయి. 18న దొమ్మతమరి, రాజవంతి, బ్యాడనూరు, తిరుమణి, బీకే హళ్లి, మరిదాసనహళ్లి, పోతగానహళ్లి, నలిగానహళ్లి, వదనకల్లు, గుజ్జనడు, మంగళవాడ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. 19న వెంకటాపుర, కొడమడుగు, కోటగుడ్డ, వళ్లూరు, పళవళ్లి, కామనదుర్గ (నీలమ్మనహళ్లి), పొన్నసముద్ర, న్యాయదకుంటె, రంగసముద్ర, సాసలకుంటె, అరసికెర గ్రామ పంచాయతీల రెండో విడత అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారిణి కేఎన్ సుజాత తెలిపారు.

వైద్యురాలికి సన్మానం



బదిలీపై వెళ్తున్న వైద్యాధికారిణి సన్మానిస్తున్న పీపీ యూనిట్ సిబ్బంది

హిందూపురం: ఉద్యోగులకు బదిలీలు సహజమే కానీ అనుభవాలు, జ్ఞాపకాలు శాశ్వితమని పీపీ యూనిట్ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారిగా పనిచేస్తున్న పద్మజ బదిలీపై వెళ్తున్న సందర్భంగా పీపీ యూనిట్ సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌బాబు, వైద్యసిబ్బంది గోవర్ధన్‌రెడ్డి, ముస్తఫా, రమేష్, శేఖర్,నబి, ఆరోగ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

పరిగి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని వక్తలు తెలిపారు. పరిగి మండల భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధిగా, విరివిగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి, కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ కార్యదర్శి నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ కుమారుడికి తీవ్రగాయాలు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు... అగళి మండలం దొక్కలపల్లికి చెందిన కుమార్ అతని కుమారుడు వరుణ్‌యాదవ్ పని నిమిత్తం కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా రెడ్డిహళ్లికి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్నారు. రొళ్లకొండ టోల్‌గేట్ వద్ద ఉన్న స్పీడ్‌బ్రేకర్లపై వేగంగా దూసుకెళ్లడంతో వాహనం అదుపు తప్పింది. కుమార్ , వరుణ్‌యాదవ్ గాయపడగా శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడ మేమనగా ఈ షెడ్యూలు దాకల అస్తి సర్వే నెం. 335-3 లో 1.39 (ఒక ఎకర 39 సెంట్లు) మా కక్షిదారుడయిన బి. ఆదినారాయణప్ప, బి. శివప్ప, బి. గోపాల్ తండ్రి బి. నరసింహప్ప లేట్, డాక్యుమెంట్ నెంబర్ 43/1975 తేది 15-01-1975 సరిహద్దులతో కొన్నది. కొన్న తేది నుంచి మా కక్షిదారులు అయిన తండ్రి గారి స్వాధీనంలో ఉన్నది. మా కక్షిదారులు తండ్రి 22-03-2011 తేదీన రిజిష్టర్ వీలునామా ద్వారా మా కక్షిదారులకు సంక్రమించినది. కావున ఈ షెడ్యుల్ థాకలు ఆస్తి పూర్తిగా మా కక్షిదారులు కు చెందినది ఎవరికీ ఎలాంటి సంబంధం లేదు కాని ఇది బూడిద గద్దపల్లి గ్రామానికి చెందిన గొల్ల బాబయ్య, తండ్రి వెంకటప్ప గారి నరసింహప్ప లేట్ బి. ఆదిలక్ష్మమ్మ భర్త బి. గంగాధరప్ప అనువారు 1.బి అడంగల్ తయారు చేసుకొని ఇతరుల అమ్ముచున్నారని తెలియ వచ్చినది పై కనపరచిన వారు గొల్ల బాబయ్య ఆదిలక్ష్మమ్మకు ఈ భూమితో ఎటువంటి సంబందము లేదు ఒకవేళ ఈ ప్రకటనను దిక్కరించి ఈ నోటీసు షెడ్యులు దాఖలు ఆస్తిని ఎవరైన కొన్న యెడల మా కక్షిదారులు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురు అని ఇందు మూలంగా హెచ్చరించడం అయినది.

షెడ్యూలు

శ్రీ సత్యసాయి జిల్లా R.D. చిలమత్తూరు S.R.D. చేరిన మల్లలపల్లి గ్రామం, గోరంట్ల మండలం. సర్వే నెం : 335.3 ఎక్స్‌టెంట్ : 1:39
హద్దులు : తూర్పు - చెన్నప్ప వగైరా భూమి
పడమర - రోడ్డు,ఉత్తరం - బి. నరసింహప్ప భూమి (నా క్ష దారుని తండ్రి భూమి)
దక్షిణం - వెంకటప్ప గారి నరసింహప్ప

సి.ఆర్. నాగార్జున, అడ్వకేట్, పెనుకొండ

కర్ణాటక మద్యం పట్టివేత

రొద్దం: మండల పరిధిలోని రాచూరు సమీపంలో ఆదివారం కర్ణాటక మద్యం తరలిస్తున్న నృమదెల గ్రామానికి చెందిన మారుతిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. 96 మద్యం పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

21న మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం

మడకశిర: మడకశిరలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఈనెల 21న నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు.

జేసీబీ అపహరణపై కేసు నమోదు

పరిగి: మండలంలోని ఊటుకూరుకు చెందిన శివారెడ్డి అనే వ్యక్తికి చెందిన జేసీబీ వాహనం నాలుగు రోజుల క్రితం అపహరణకు గురైంది. అన్ని చోట్లా గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం వాహన యజమాని శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రొద్దం: మండలంలోని చిన్నగువ్వలపల్లికి ఎంపీ నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ చంద్రశేఖర్ తెలిపారు. హిందూపురం–రొద్దం ప్రధాన రహదారి నుంచి దాదాపు కిలో మీటర్ వరుకూ రోడ్డు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల: మండలపరిధిలోని పుట్టగుండ్లపల్లి సర్పంచ్ నార్పిరెడ్డి తల్లి బాబిరెడ్డిగారి రంగమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గుంతపల్లికి చేరుకొని రంగమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, పావగడ, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పట్టుదలతో లక్ష్యం సాధించాలి

పావగడ: విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని సాధించుకోవాలని స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో శివకుమార స్వామిజీ, అబ్దుల్ కలాం అభిమానుల మహావేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పది, ఇంటర్‌లలో ఉత్తమ మార్కులు సాధించిన 185 మందికి ప్రతిభా పురస్కారాలు అందించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, మండల ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని అగ్రహారంలో హేమరాజు అనే వ్యక్తి అనుమతి లేకుండా ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

గెలుపోటములు సహజం

సోమందేపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని ఎస్‌ఐ విజయ్ కుమార్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని స్నేహలతనగర్ క్రీడా మైదానంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన శ్రీకాంత్ ఎలెవెన్స్ జట్టు 16 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పెనుకొండ అన్నూ థండర్స్ జట్టు 62 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జబీవుల్లా, శ్రీనివాసులు, హనుమంతు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

